సాక్షి
నిర్మల్
సోమవారం । 8 । జూలై । 2024



'అకాడి' సంబురం

కొత్త సంవత్సరంలో ప్రారంభమయ్యే ప్రథమ పండుగ అకాడి ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గూడేల్లో మొదలైంది. గురుపౌర్ణమి నాటికి ఈ పండుగ ముగుస్తుంది. 8లో▸

నేడు భైంసాకు ఎంపీ రాక

ముధోల్: భైంసా పట్టణంలోని ఎస్ఎస్ కాటన్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో నేడు నిర్వహించనున్న పార్టీ సమావేశానికి ఎంపీ గోడం నగేశ్ రానున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై సమీక్ష సమావేశం, కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.1 /24.6

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల మోస్తరు వాన కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కళాశాలలో సిబ్బందిని నియమించాలి




శృతిఓజాకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

కుంటాల: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని నాలుగు రోజుల క్రితం గ్రామస్తులు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను కలిసి విన్నవించారు. ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని ఇంటర్ విద్య డైరెక్టర్, సెక్రటరీ శృతి ఓజాను శుక్రవారం కలిశారు. అధ్యాపకులను నియమించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ అరుణ రమణారావు ఉన్నారు.

అరుణాచలం గిరికి ప్రత్యేక బస్సు

నిర్మల్‌టౌన్: నిర్మల్ బస్ డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 న మధ్యాహ్నం ఒంటిగంటకు బయలుదేరి మధ్యలో కాణిపాకం సిద్ధి వినాయక టెంపుల్, తమిళనాడులోని వెల్లూరు లక్ష్మీదేవి, గోల్డెన్ టెంపుల్ మీదుగా 20వ తేదీ సాయంత్రం 7 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. తిరుగుప్రయాణంలో 21న అరుణాచలం నుంచి బయలుదేరి 22న సాయంత్రం 7 గంటలకు నిర్మల్ చేరుకుంటుందని వివరించారు. ఇందుకు ఒకరికి రూ.4,800 చొప్పున టికెట్ ధర ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9959226003, 9492767879 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జిల్లా ఉపాధ్యాయుడికి సైన్స్ అకాడమీ అవార్డు



అవార్డు అందుకుంటున్న రమేశ్

నిర్మల్ రూరల్: విద్యార్థులకు వినూత్న పద్ధతులతో యాక్టివిటీ బేస్డ్ బోధన చేసినందుకు గానూ సారంగాపూర్ మండలం చించోలి(బి) ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కూన రమేశ్‌కు టెక్ మహీంద్రా సంస్థ సైన్స్ అకాడమీ అవార్డును అందించింది. సదరు సంస్థ ఐదేళ్లుగా రాష్ట్రస్థాయిలో సైన్స్ ఉపాధ్యాయులకు వివిధ అంశాలలో శిక్షణ అందిస్తోంది. 2021–22 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 300కు పైగా సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. అనంతరం 'ట్రాన్స్‌ఫార్మింగ్ ఎడ్యుకేటర్' అనే పోటీలు నిర్వహిస్తున్నారు. 2022 సంవత్సరానికిగానూ వినూత్న పద్ధతులు వాడి, ఆక్టివిటీ బేస్డ్ బోధన చేసిన కూన రమేశ్ భౌతికశాస్త్ర విభాగంలో సంస్థ నిర్వహించిన పోటీల్లో గెలుపొంది ద్వితీయస్థానంలో నిలిచారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రమేశ్ అవార్డు అందుకున్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రితో జిల్లా గౌడ సంఘం నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లాకు చెందిన గౌడ సంఘం నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వెంటనే కల్లుగీత కార్పొరేషన్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు సిద్దిరాములు గౌడ్, బాలేశం గౌడ్, ముత్యం నరసింహులు, సురేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

హద్దుదాటుతున్న మైనర్లు..!

- వయసుకు మించి పనులు
- ఇష్టారీతిన వాహనాల డ్రైవింగ్
- పలు కేసుల్లోనూ వాళ్ల పేర్లు
- గాడిన పెట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే!



నిర్మల్: మైనర్లు.. అంటే 18 ఏళ్లలోపు వయసు కలిగిన పిల్లలు. ఈ వయసులో చదువు, ఆటలు, ఇల్లు, దోస్తులు.. ఇవే వారి లోకం. అలాగే ఉండాలి కూడా. కానీ.. ఇటీవల వీళ్లు వయసుకు మించిన పనులు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో గంజాయి, హత్యానేరం కేసుల్లోనూ భాగస్వాములుగా మారడం కలవర పెడుతోంది. జిల్లాలో విస్తృతమవుతున్న గంజాయి వ్యసనంలో మైనర్ల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఇటీవల జరిగిన ఓ హత్య కేసులోనూ ముగ్గురు నిందితులు మైనర్లే కావడం గమనార్హం. ఇక బైకులు పట్టుకుని రోడ్లపై విన్యాసాలు చేస్తున్న వారిలోనూ వీరే ఎక్కువగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులూ సీరియస్‌గానే స్పందిస్తున్నారు. ఇటీవల నిర్మల్‌లో ఓ మైనర్ బాలుడు చేసిన యాక్సిడెంట్ విషయంలో అతడితో పాటు తల్లిపైనా కేసు నమోదైంది.

రోడ్లమీద హల్‌చల్..

తెలిసీ తెలియని వయసులో మైనర్లు రోడ్లపై వాహనాలతో చక్కర్లు కొడుతున్నారు. వేగంగా దూసుకుపోతూ ఆనందపడుతున్నారు. కానీ అనుకోని ఘటన జరిగి, రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే ఆ ఆనందం కాస్త ఆవిరవుతుంది. ఇలాంటి ప్రమాదాల్లో వీరే కాదు.. ఎదుటి వ్యక్తుల ప్రాణాలకూ పరేషానే. ఇటీవల జిల్లా కేంద్రంలో ఇదే జరిగింది. ఓ మైనర్ బాలుడు తన తల్లికి సంబంధించిన బండిని తీసుకుని వేగంగా దూసుకుపోయాడు. అచ్చీరాని డ్రైవింగ్‌తో మరో వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఈ బాలుడితో పాటు ఎదుటి వాహనంపై ఉన్న ఇద్దరికీ గాయాలయ్యాయి. ఇటీవల మైనర్ డ్రైవింగ్‌పై సీరియస్‌గా దృష్టి పెట్టిన జిల్లా పోలీసులు వెంటనే కేసు నమోదు చేశారు. ఆ మైనర్‌తో పాటు అతని తల్లిపైనా కేసు నమోదు కావడం గమనార్హం. ఇలాంటి విషయాల్లో బండి నడిపిన మైనర్లతో పాటు వారికి ఆ వాహనాలు ఇచ్చిన పెద్దలపైనా కేసులు నమోదు చేస్తున్నారు.

పెద్దలపైనా కేసులు..



మైనర్ పిల్లలు డ్రైవింగ్ చేయడం చట్టప్రకారం నేరం. ఇలాంటి ఘటనల్లో మైనర్లతో పాటు వారికి వాహనాలు ఇచ్చిన పెద్దలపైనా కేసులు పెడతాం. తమ పిల్లలకు బైక్ నడపటం వచ్చన్న సంతోషంలో వారు ప్రమాదాలకూ కారకులు కావచ్చన్న విషయాన్ని మర్చిపోవద్దు. తమ పిల్లలు ఏం చేస్తున్నారన్న విషయాన్ని ప్రతీ తల్లిదండ్రులు గమనించాల్సిన అవసరం ఉంది.
– జానకీ షర్మిల, ఎస్పీ

తల్లిదండ్రులదే బాధ్యత..

తమ పిల్లలు ఏం చేస్తున్నారనే విషయం ప్రతీ తల్లిదండ్రులకు తెలియాల్సిన అవసరం ఉంది. తమ కొడుకు ఎలా ఉన్నాడు.. తన మనస్తత్వం ఎలా మారుతోంది. తన మిత్రులతో ఎటు వెళ్తున్నాడు.. బయట అతడి పరిస్థితి ఎలా ఉంది.. ఇలాంటి విషయాలను ఆరా తీస్తూ.. వారిని గాడిన పెట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. మైనర్ బాలికలు సైతం వయసుకు మించి ప్రవర్తిస్తున్న తీరు కలవర పెడుతోంది. ఇలాంటి విషయాల్లోనూ తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యమే కారణంగా కనిపిస్తోంది. తమ పిల్లలకు కావాల్సినవి ఇస్తున్నామన్న ధోరణిలో ఉంటున్నారే తప్పా.. వాళ్లేం చేస్తున్నారనే పట్టింపు తగ్గుతోందన్న విషయం చాలా సందర్భాల్లో స్పష్టమవుతోంది.

వయసుకు మించి..

వాహనాలను నడపటంతోనే మైనర్లు ఆగిపోవడం లేదు. తమ వయసుకు మించిన పనులు చేస్తున్నారు. ఇటీవల జిల్లాలో గంజాయి భూతం విస్తృతంగా వ్యాపిస్తోంది. ఇందులో 18 ఏళ్లు కూడా నిండని వాళ్లే ఎక్కువగా ఈ గంజాయికి బానిసలుగా మారుతుండటం కలవరపెడుతోంది. చిన్నవయసులోనే సిగరెట్లు, మద్యానికి అలవాటు పడుతున్నారు. గంజాయిపై దృష్టి పెట్టిన పోలీసులకు చాలామంది మైనర్లు పట్టుబడుతున్నారు. కొంతమందికి గతంలో కౌన్సెలింగ్ ఇచ్చినా.. మళ్లీమళ్లీ గంజాయికి అలవాటు పడుతున్నట్లు తేలుతోంది. ఈ మత్తు కోసం గతంలో కొంతమంది ఇంట్లో దొంగతనాలు చేసిన ఘటనలూ ఉన్నాయి.

విపరీత మనస్తత్వం..

ధూమపానం, మద్యపానంతో పాటు గంజాయి వరకూ చేరుకున్న మైనర్లు కొన్ని సందర్భాల్లో దాడులు, హత్యల వరకూ వెళ్తుండటం మరింత కలవరపెట్టే విషయం. ఇటీవల బాసరలో జరిగిన ఓ హత్య కేసులో నిందితులు ముగ్గురూ 18 ఏళ్ల లోపు వారే ఉండటం గమనార్హం. జిల్లా కేంద్రంలో ఇటీవల రాత్రిపూట పోలీసులు ఆకస్మికంగా చేసిన తనిఖీల్లోనూ పట్టుబడ్డవారిలో వీళ్లే ఉన్నారు. రాత్రిపూట బైక్‌లు తీసుకుని కొంతమంది రోడ్లపై షికార్లు కొడుతున్నారు. సినిమా తరహాలో స్టంట్లు చేయడం, సైలెన్సర్లను మార్చి విపరీతమైన శబ్దంతో దూసుకుపోవడం వంటివి చేస్తున్నారు.

కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలి

- సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్



మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్

నిర్మల్: ప్రపంచంలో ఎక్కడా లేనటువంటి కుటుంబ వ్యవస్థ మనదేశంలో ఉందని, ఈ వ్యవస్థ ఉన్నంత వరకే సమాజం బలంగా ఉంటుందని, దీన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌కె కన్వెన్షన్‌లో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో గురుపూజా దినోత్సవం నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కుటుంబవ్యవస్థ బలంగా ఉండాలని, తమ పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. వారు ధర్మబద్ధంగా, ధైర్యంగా ఉండేలా మార్గదర్శనం చేయాలన్నారు. ప్రతీ ఇంట్లో సంత్ రవిదాస్, అంబేద్కర్ వంటి మహనీయుల ఫొటోలు ఉండాలని, వారి గురించి ఇంటిల్లిపాదికి తెలియాలని చెప్పారు. ఆర్ఎస్ఎస్ వ్యక్తిని కాకుండా వ్యవస్థను నమ్ముతుందని, అందుకే కాషాయ ధ్వజాన్ని గురువుగా స్వీకరించిందని వివరించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారతదేశంలో గురుపరంపర ఉందన్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ అన్వేష్, ఆర్ఎస్ఎస్ జిల్లా, నగర్ సంఘచాలక్‌లు నూకల విజయ్‌కుమార్, ప్రమోద్ చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు బ్రేక్

- డీజిల్‌కు డబ్బులు లేక కదలని ట్రాక్టర్లు
- తమ జేబుల నుంచి పెట్టలేమంటున్న కార్యదర్శులు
- వర్షాకాలంలో గ్రామాల్లో లోపిస్తున్న పారిశుధ్యం



లక్ష్మణచాందలో చెత్త సేకరిస్తున్న కార్మికులు (ఫైల్)

లక్ష్మణచాంద: గ్రామాల్లో చేపడుతున్న వివిధ పనుల నిమిత్తం గ్రామ పంచాయతీలకు నెలనెలా నిధులు విడుదల చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కొన్నినెలలుగా విడుదల చేయడం లేదు. దీంతో జిల్లాలోని పలు గ్రామాల్లో నిధుల కొరతతో గ్రామ పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్‌కు కూడా డబ్బులు లేకపోవడంతో చెత్త సేకరణ నిలిచిపోయింది.

పేరుకుపోతున్న చెత్త...

గ్రామ పంచాయతీలో నిత్యం ప్రతీ ఇంటినుంచి సిబ్బంది చెత్తను సేకరించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తారు. కానీ 5 నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులు నిలిచిపోవడంతో చెత్తను తరలించే ట్రాక్టర్లలో డీజిల్ పోయడానికి కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామాల్లో చెత్త సేకరణ నిలిచిపోయిందని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. వీధుల్లో చెత్త పేరుకు పోవడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ట్రాక్టర్ల మరమ్మతులకు లేని డబ్బులు...

పంచాయతీ పాలకవర్గాలు గత ఫిబ్రవరితో ముగిశాయి. అప్పటి నుంచి గ్రామాల్లో చెత్తను సేకరించే ట్రాక్టర్ల నిర్వహణ అధ్వానంగా మారింది. కనీసం పాత టైర్ల స్థానంలో కొత్త టైర్లు వేసుకోలేని పరిస్థితి నెలకొందని పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు రైతుల ట్రాక్టర్ల పాత టైర్లను తీసుకుని వేయించారు. మరికొన్ని గ్రామాల్లో పాత టైర్లతోనే కాలం వెళ్లదీస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శుల జేబుల నుంచి..

ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి గ్రామ పంచాయతీలకు ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో గ్రామ పంచాయతీల్లో చేస్తున్న ఖర్చులన్నీ తామే భరిస్తున్నామని ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు తెలిపారు. గత వేసవిలో బోర్ల మరమ్మతులకు, చెత్త ట్రాక్టర్ల డీజిల్ కోసం, ఇతర పనుల నిమిత్తం ఒక్కొక్కరు రూ.50 వేల నుంచి రూ.60 వేల రూపాయల సొంత నిధులు వెచ్చించినట్లు తెలుస్తోంది. అందుకే చెత్త సేకరణ నిలిపివేశామని పేర్కొంటున్నారు.

ఎంపీడీవోలకు వినతి...

గ్రామ పంచాయతీలకు పాలక వర్గం ముగిసినప్పటి నుంచి ఎలాంటి నిధులు రావడం లేదు. దీంతో ఇప్పటి వరకు తమ సొంత నిధులు ఖర్చు చేసిన పంచాయతీ కార్యదర్శులు ఇక తమతో కాదంటున్నారు. 5 నెలల నుంచి జీపీ కార్మికుల వేతనాలు ఇవ్వడం లేదని, ఇక చెత్త సేకరణ కూడా చేపట్టడం కష్టమని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇటీవల జిల్లాలోని పలు మండలాలకు చెందిన కార్యదర్శులు ఆయా మండలాల ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు.

రూ.2 లక్షలకు పైగా ఖర్చుచేశా..



వేసవిలో మిషన్ భగీరథ పైపులైన్, చెత్త ట్రాక్టర్‌కు డీజిల్, బోరుబావుల మరమ్మతు కోసం రూ.2 లక్షలకు పైగా సొంతడబ్బులు ఖర్చుచేశా. దీంతో చాలా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి వెంటనే పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి.
– శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, పొట్టపెల్లి(కే)

ప్రభుత్వానికి నివేదించాం



గ్రామ పంచాయతీలకు నిధుల గురించి ఇదివరకే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. కలెక్టర్ ద్వారా కమిషనర్‌కు కూడా నివేదించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే తగిన చర్యలు చేపడుతాం. గ్రామాల్లో పన్నులు వసూలైతే జీపీలకు కొంతమేర నిధులు సమకూరే అవకాశం ఉంటుంది.
– శ్రీనివాస్ జిల్లా పంచాయతీ అధికారి

అంగన్‌వాడీల రిటైర్మెంట్

- జిల్లాలో 27 మంది టీచర్లు, 96 మంది హెల్పర్ల సర్వీస్ పూర్తి
- ఈ నెల 1 నుంచి హాజరు నమోదు నిలిపివేత
- రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై పెదవి విరుపు
- సగం వేతనమైనా పింఛన్‌గా ఇవ్వాలని వినతి

వివరాలు

జిల్లాలోని ప్రాజెక్టులు	4
సెక్టార్లు	37
మెయిన్ అంగన్‌వాడీలు	816
మినీ అంగన్‌వాడీలు	110

ప్రాజెక్టులవారీగా రిటైర్ అయిన సిబ్బంది

ప్రాజెక్టు	అంగన్‌వాడీ టీచర్లు	హెల్పర్లు
భైంసా	11	14
నిర్మల్	9	36
ముధోల్	7	25
ఖానాపూర్	0	21



జిల్లా కేంద్రంలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల రిటైర్మెంట్ జిల్లాలో అమలులోకి వచ్చింది. 65 ఏళ్లు దాటిన 27 మంది టీచర్లు, 96 మంది ఆయాల సర్వీస్‌ను అధికారులు నిలిపివేశారు. దీంతో దశాబ్దాలుగా పిల్లలే లోకంగా గడిపినవారు జూలై 1 నుంచి విధులకు దూరమయ్యారు. మరోవైపు ప్రభుత్వం చెల్లించే రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై పెదవి విరుస్తున్నారు. జీవితమంతా పిల్లల కోసం ధారపోశామని, శక్తి ఉడిగిన వయస్సులో కుటుంబం గడవడానికి వేతనంలో సగం పింఛన్ రూపంలో నెలనెలా చెల్లించాలని కోరుతున్నారు.

1 నుంచి హాజరు నిలిపివేత..

మహిళా, శిశు సంక్షేమ శాఖలో భాగమైన అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలకు ఇప్పటి వరకు ఎలాంటి రిటైర్మెంట్ విధానం లేకపోవడంతో వయస్సు పైబడ్డ వారు సైతం విధుల్లో కొనసాగుతున్నారు. దీంతో 65 ఏళ్లు నిండిన వారు తమ ఉద్యోగాల నుంచి రిటైర్ కావాలని ప్రభుత్వం అంగన్‌వాడీల్లో సైతం రిటైర్మెంట్ విధానం అమలులోకి తెచ్చింది. ఈ విధానం ఈనెల 1 నుంచి అమలు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. 2024, ఏప్రిల్ 30 వరకు 65 ఏళ్లు పైబడిన టీచర్లు, హెల్పర్లందరికీ రిటైర్మెంట్ వర్తింపజేస్తూ మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉత్తర్వుల మేరకు 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల అటెండెన్స్ నమోదు నిలిపివేశారు. ఈమేరకు జిల్లాలోని ఐసీడీఎస్‌ల పరిధిలోని సీడీపీవోలు, సూపర్‌వైజర్లకు ఆదేశాలు జారీ చేశారు.

నెలకు రూ.150 జీతంతో....

ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న వారిలో చాలామంది టీచర్లు, ఆయాలకు మూడు నాలుగు దశాబ్దాల అనుభవం ఉంది. అప్పట్లో కేవలం రూ.150 జీతంతో పలువురు అంగన్‌వాడీ టీచర్లుగా చేరారు. అరకొర వేతనాలతో మూడు నాలుగు దశాబ్దాలపాటు పనిచేశారు. ప్రస్తుతం టీచర్లకు నెలకు రూ.13,650, ఆయాలకు రూ.7,800 వేతనం ఇస్తున్నారు. ఇన్నాళ్లూ వారికి తప్పనిసరి రిటైర్మెంట్ లేదు. శక్తి ఉన్నంత వరకు పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకునేవారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగ విరమణ తప్పనిసరి చేసింది. 65 ఏళ్లు పూర్తి చేసుకున్న టీచర్లు, హెల్పర్లు తప్పకుండా రిటైరవ్వాలని ఆదేశించింది. రిటైర్మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఇస్తామని ప్రకటించింది. దీనిపై వారు పెదవి విరుస్తున్నారు. అరకొర వేతనాలతో మూడు నాలుగు దశాబ్దాలు పనిచేశామని, ఇప్పుడు ఈ కొద్దిపాటి డబ్బులతో ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు.

ఖాళీల భర్తీ ఎప్పుడో..?

65 ఏళ్లు పైబడిన టీచర్లు, ఆయాలు ఈనెల 1 నుంచి విధులకు రావాల్సిన అవసరం లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రభుత్వం ఆయా కేంద్రాలను ఎవరు నిర్వహించాలన్న దానిపై స్పష్టత ఇవ్వలేదు. కొన్ని చోట్ల టీచర్లు, మరికొన్ని చోట్ల ఆయాలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. రిటైర్మెంట్‌తో ఖాళీ అయ్యే పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారన్న విషయంలో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వలేదు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేరు. తాజాగా రిటైర్మెంట్‌తో 27 టీచర్ పోస్టులు, 96 ఆయా పోస్టులు ఖాళీ అయ్యాయి. అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో ఖాళీలతో చిన్నారులకు విద్యాబోధన, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ ఎలా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఆందోళన

టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కొంతకాలంగా అంగన్‌వాడీ ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారికి అన్నిరకాల ప్రయోజనాలు కల్పించడంతో పాటు పెన్షన్ ఇస్తున్నారని, తమకు కూడా వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ ప్రభుత్వం అంగన్‌వాడీల ఆందోళనను పరిగణనలోకి తీసుకోలేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచకుండానే ఉద్యోగ విరమణను తప్పనిసరి చేస్తూ జీవో జారీ చేసింది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..



65 ఏళ్లు నిండిన వారికి రిటైర్మెంట్ అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మా వద్ద ఉన్న వివరాల ఆధారంగా ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ఖాళీగా ఉండే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
– నాగమణి, జిల్లా సంక్షేమాధికారి

బొగ్గు గనులు సింగరేణికే కేటాయించాలి

ఖానాపూర్: కేంద్ర ప్రభుత్వం నూతన బొగ్గు గనుల వేలం ఆపి సింగరేణి సంస్థకే కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మస్కాపూర్‌లోని సీఎంరావు ఫంక్షన్ హాలులో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు గనులు తవ్వే అవకాశం ప్రైవేటు సంస్థలకు కల్పించడం సరికాదన్నారు. బొగ్గు గనుల శాఖ కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలం పాట నిర్వహించడం సరికాదన్నారు. నగదీకరణ పేరుతో దేశంలోని రూ.6 లక్షల కోట్ల విలువైన ఆస్తులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గౌతమ్‌కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూతన్‌కుమార్, నాయకులు బొమ్మెన సురేశ్, తొడసం శంభు పాల్గొన్నారు.

జై జగన్నాథ్...



'జై జగన్నాథ్.. జైజై పూరీ జగన్నాథ్.. హరేరామా.. హరే కృష్ణ..' అంటూ జిల్లా కేంద్రం భక్తిపారవశ్యంతో నిండిపోయింది. భక్తులంతా తన్మయత్వంతో తాడును లాగుతూ ఉంటే.. ఆ పూరీ జగన్నాథుడు పురవీధుల్లో ముందుకు సాగాడు. అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర నిర్వహించారు. గాంధీచౌక్ మురళీకృష్ణ ఆలయం నుంచి పురవీధుల గుండా దేవరకోట దేవస్థానం వరకు చేరుకుంది. పట్టణవాసులు, ఇస్కాన్ భక్తులు దారిపొడవునా హరినామ సంకీర్తనలు చేస్తూ.. తన్మయత్వంతో నృత్యాలు చేస్తూ రథోత్సవం నిర్వహించారు. – నిర్మల్

క్లుప్తంగా

క్రిమిసంహారక మందుతాగి ఒకరి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన కట్కూరి శ్రీనివాస్(50) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌కు కొన్నేళ్లుగా మతిస్థిమితం సరిగా ఉండడం లేదు. మద్యానికి అలవాటుపడ్డాడు. ఈక్రమంలో నాలుగేళ్ల క్రితమే ఓసారి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా అతనిలో మార్పు రాలేదు. ఈనెల 5న గేదను మందలో తోలివస్తానని చెప్పి, టీవీఎస్ ఎక్సల్ వాహనంతో ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం అయినా తిరిగి రాకపోయేసరికి అతని ఆచూకీ కోసం వెతికారు. ఆదివారం ఉదయం ద్వారక గోదావరినదిలో అతడి శవం కనిపించింది. నీటి ఒడ్డున పురుగుల మందు డబ్బా, మద్యం సీసా ఉండటంతో మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి నదిలో పడిపోయాడని ఉంటాడని కుటుంబీకులు భావిస్తున్నారు. శ్రీనివాస్ భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని మతిస్థిమితంలేని వ్యక్తి ఆత్మహత్య


శివకుమార్ (ఫైల్)

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్ ఏరియాలో నివాసముంటున్న మాల్యం శివకుమార్ (32) అనే మతిస్థిమితంలేని వ్యక్తి ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం తల్లి, సోదరి ఇంటి నుంచి మార్కెట్‌కు సామగ్రి కోసం వెళ్లగా ఈ ఘాతుకానికి పాలడ్డాడు. మృతుడి తల్లి లక్ష్మీకాంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

బావిలో మృతదేహం

మందమర్రిరూరల్: మందమర్రి దీపక్‌నగర్ రైల్వే ట్రాక్ సమీపంలోని కోల్ యార్డు వద్దగల బావిలో ఆదివారం యువకుని మృతదేహం గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్సై రాజశేఖర్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మృతుడు దీపక్‌నగర్‌కు చెందిన సూరమల్ల ప్రణయ్(30)గా గుర్తించామని తెలిపారు. కొంత కాలంగా తాగుడుకు బానిసైన అతను బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పోచమ్మ విగ్రహం ధ్వంసం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రగుంటపల్లి గ్రామంలోని ఊరపోచమ్మ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్తున్న మహిళలు ఆలయం ఆవరణ చిందరవందగా ఉండడం గమనించారు. దగ్గరకు వెళ్లి చూడగా అమ్మవారి విగ్రహం ధ్వంసమై ఉంది. ఇది ఆకతాయిల పనా లేక ఎవరైనా గుప్తనిధుల కోసం చేశారా అనే విషయం తెలియాల్సి ఉంది. ఆలయ సమీపంలో ఒక మతిస్థిమితం లేని మహిళ కూడా తిరుగుతుందని తెలిపారు. ఆలయం సమీపంలో రాత్రి సమయంలో ఆకతాయిలు మద్యం సేవించి తిరుగుతారని, పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అకాడి సంబురం


పూజలు చేస్తున్న దంబిరావు


పెద్ద దేవుని వద్ద మొక్కుతున్న ఆదివాసీలు


కోడి పంచాంగం చూస్తున్న ఆదివాసీలు

- ఆదివాసీ సంస్కృతికి ప్రతిబింబం
- సందడిగా మారిన గూడేలు, పల్లెలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకలు ప్రారంభం

కెరమెరి(ఆసిఫాబాద్): కొత్త సంవత్సరంలో ప్రారంభమయ్యే ప్రథమ పండుగ అకాడిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీలు గూడేల్లో ఘనంగా జరుపుకొంటున్నారు. అడవికి వెళ్లి అక్కడే ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వంటావార్పులు చేస్తూ రోజంతా ఉల్లాసంగా గడుపుతున్నారు. పశువులకు రక్షణ కల్పించే దేవుడి పండుగగా ఆదివాసీలు భావిస్తున్నారు. ఆదివారం ఉమ్మడి జిల్లాలోని అనేక గూడేల్లో అకాడి పండుగ ప్రారంభమైంది. గురుపౌర్ణిమ నాటికి ఈ పండుగ ముగుస్తుంది. పండుగలు జరుపుకోవడంలో తమకు తామే సాటి అని నిరూపించుకుంటున్న ఆదివాసీలు తమ సంస్కృతి, ఆచార వ్యవహారాలను కాపాడడంలో ముందుంటున్నారు.

పక్షం రోజులు వేడుకలు

ఆదివాసీలు అనాదిగా వస్తున్న ఆచారాలను నేటికీ పాటిస్తున్నారు. చినుకు రాలినా.. దుక్కి దున్నినా.. విత్తనాలు వేసినా.. పంటలు చేతికొచ్చినా.. ప్రత్యేక పూజలు చేస్తారు. పంటల దిగుబడి రావాలన్నా.. పశువులకు మేత లభించాలన్నా.. క్రూరమృగాల నుంచి రక్షణ కల్పించాలన్నా దేవునిపైనే ఆధారపడ్డారు. ఆషాఢ మాసంలో నెలవంక కనిపించడంతో ప్రారంభమయ్యే అకాడి పండుగను పక్షం రోజులు జరుపుకొంటారు. దీంతో గూడేలు, పల్లెల్లో సందడి నెలకొంది.

ఆషాఢ మాసంతో ప్రారంభం

ఆషాఢ మాసంతో ప్రారంభమయ్యే పండుగల్లో ప్రథమంగా వచ్చే పండుగ అకాడి. అడవి దేవతగా కొలిచే ఆదివాసీలు రాజుల్‌పేన్ పాడిపశువులకు రక్షణ కల్పించే దేవతగా పూజిస్తారు. నెలవంక కనిపించగానే ప్రారంభమయ్యే ఈ పండగను జిల్లాలోని ప్రతీ గ్రామంలో నిర్వహిస్తున్నారు. ఈసారి దుక్కులు దున్నడం కొంత ఆలస్యం కాగా, పండుగను ఆలస్యంగా ప్రారంభించారు.

వనంలో పూజలు..

అకాడి వేడుకల్లో భాగంగా గ్రామం నుంచి పొలిమేరలో ఉండే బాబ్రి చెట్టు వద్దకు వెళ్తారు. చెట్టుకింద ఉన్న పవిత్ర దేవతలను శుద్ధి చేసిన అనంతరం పసుపుతో గీతలు గీస్తారు. దాని ఎదుటే బియ్యం పోసి రాజుల్‌పేన్‌కు ప్రత్యేక పూజలు చేస్తారు. కటోడాలు అక్షింతలు ఇచ్చిన తర్వాత దేవుడిని మొక్కుతారు. అనంతరం అంతా అక్షింతలు సమర్పిస్తారు. వనంలోనే భోజనం తయారు చేస్తారు. నైవేద్యం సమర్పిస్తారు. సహపంక్తి భోజనం చేస్తారు. అడవుల్లోని చెట్ల ఆకులను దేవునిగా భావించి అకాడి పేన్ పూజ చేశాక ఆ ఆకులను ఇంటికి తీసుకెళ్తారు.

వేడుకల్లో కొత్త కోణం

అకాడి వేడుకల్లో మరో కొత్త కోణం ఉంది. అడవికి వెళ్లిన పశువులు తిరిగి ఇళ్లకు చేరాలంటే తుత్ర వాయించాలనేది వారి ఆచారం. కాపరుల వద్ద ఈ తుత్ర ఉంటుంది. పశువులు ఎక్కడికి వెళ్లినా ఈ తుత్ర వాయిస్తే అవి తిరిగి వస్తాయని వారి నమ్మకం. నెలపాటు దీనిని వాయిస్తూనే ఉంటారని పలువురు కటోడాలు చెబుతున్నారు. ఈ శబ్దాలు విన్న పశువులు దారి మళ్లకుండా తిరిగి అదే స్థానంలోకి వస్తాయని తెలిపారు.

ప్రత్యేకం.. కోడి జాతకం

ఆదివాసీల ఆచార వ్యవహారాలకు అనుగుణంగా అకాడి పండుగ చేసేందుకు ప్రతి ఒక్కరూ సొంత డబ్బులతో కోడిని గొనుగోలు చేస్తారు. ఈ సందర్భంగా కోడి జాతకం చెబుతుందని ఆదివాసీల విశ్వాసం. ఆదివాసీలు బియ్యం జమ చేసి అడవికి వెళ్తారు. అక్కడే ఒకచోట చేరి భోజనం తయారు చేస్తారు. అనంతరం అదే భోజనాన్ని ముద్దలుగా చేసి ప్రతీ ఒక్కరికి ఒకటి చొప్పున వడ్డిస్తారు. దీనిని వారు మహాప్రసాదంగా భావించి ఆరగిస్తారు.

ఏత్మాసార్ పేన్‌కు పూజలు

అకాడి పండుగ అనంతరం ఆదివాసీలు ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేస్తారు. ఈ పూజలు నాలుగు మాసాల పాటు నిర్వహిస్తారు. గ్రామంలోని ప్రజలు, పశువులు క్షేమంగా ఉండాలని, అంతా ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని మొక్కుకుంటారు. అకాడి తర్వాత నాగుల పంచమి, జాముురావూస్, శివబోడి, పొలాల అమావాస్య, బడిగా, దసరా, భోగి, దీపావళి పండుగలు జరుపుకొంటారు. విత్తన పూజల నుంచి అకాడి వరకు నాయీబ్రాహ్మణుల వద్దకు వెళ్లడం కుదరదు. ఆ పండుగ అయ్యాకనే క్షవరం చేయిస్తామని, గడ్డం గీయిస్తామని ఆదివాసీ పెద్దలు చెబుతున్నారు.

అనాదిగా వస్తున్న ఆచారం



అకాడి అనాదిగా వస్తున్న ఆచార పండుగ. ఈ పండుగ తర్వాతే మిగతా పండుగలు జరుపుకొంటాం. అప్పటివరకు ఎలాంటి పండుగలు చేయరాదు. రాజుల్ దేవతకు ప్రత్యేక పూజలు చేస్తాం. ఇది ఆదివాసీల ఆచారం.

– కుర్సెంగ సోంజి, పెద్దసాకడ

దేవతలను కొలిచే పండుగ



ప్రజలు, పశుపక్షాదులు ఆయురారోగ్యాలతో ఉండాలని రాజుల్ దేవతను కొలిచే పండుగ ఇది. ఇందులో భాగంగానే కోడి పంచాంగం చెబుతుంది. భవిష్యత్ తెలుస్తుంది. దాని ప్రకారమే ఏడాదంతా నడవాల్సి ఉంటుంది.

– పెందోర్ మోతీరాం, కెరమెరి

ఐకమత్యానికి నిదర్శనం



అకాడి పూజల తర్వాత ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేస్తాం. అనంతరం నాలుగు మాసాలు పూజలు చేయాల్సి ఉంటుంది. గుస్సాడీ దీక్ష స్వీకరించే వారు ఈ రోజు మొక్కుకుంటారు. వనభోజనం అందరి ఐకమత్యాన్ని తెలియజేస్తుంది.

– ఆత్రం బొజ్జిరావు, చౌపన్‌గూడ

108లో ప్రసవం


అంబులెన్సులో డెలివరీ చేసిన సిబ్బంది

లక్సెట్టిపేట:మండల కేంద్రంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన గర్భిణి రజిత పురిటినొప్పుల రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. అంబులెన్సు సిబ్బంది వెంటనే వెళ్లి వాహనంలో పట్టణంలోని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తీసుకు వస్తుండగా మార్గమధ్యంలోనే నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ చుంచు తిరుపతి డెలివరీ చేశారు. మగ శిశువు జన్మించడంతో కుటుంబీకులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం తల్లి శిశువును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో తీసుకెళ్లారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కార్డుల విధానం ఉపసంహరించుకోవాలి

శ్రీరాంపూర్:సింగరేణి యాజమాన్యం ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యల పేరుతో పసుపు కార్డు, ఎరుపు కార్డులు ఇవ్వాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరబద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా డిమాండ్ చేశారు. ఇప్పటికే మైనింగ్ స్టాఫ్, కార్మికులపై పనిభారం మోపుతున్నారని పేర్కొన్నారు. తాజాగా కార్డులు ప్రవేశపెట్టే ఆలోచన చేయడం సరికాదని తెలిపారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఆందోళన తప్పదని స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

బెల్లంపల్లిరూరల్:బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన చిలుముల లక్ష్మయ్యకు చెందిన ఎద్దు(కోడె) ఉదయం మేత కోసం గ్రామ శివారులోని ఊర చెరువు వద్దకు వెళ్లింది. మేత మేస్తూ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్ సరఫరా అయి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ శాఖ, పశువైద్య సిబ్బంది అక్కడి చేరుకుని పంచనామా చేపట్టారు. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు. రూ.30 వేలు ఉంటుందని బాధిత రైతుల తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి

- బట్టలు ఆరేస్తుండగా ప్రమాదం


తీగుళ్ల శారద(ఫైల్)

శ్రీరాంపూర్:శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్కే-6 కాలనీకి చెందిన తీగుళ్ల శారద(46) విద్యుత్‌షాక్‌తో ఆదివారం మృతి చెందింది. ఉదయం ఇంటి ముందు ఉన్న షెడ్డులో కట్టిన ఇనుప దండెంపై బట్టలు ఆరేస్తుండగా విద్యుత్‌షాక్‌కుగురై అక్కడిక్కడే మృతి చెందింది. షాక్ తగిలిన వెంటనే శాకద కిందపడింది. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికి మృతిచెందింది. బట్టలు ఆరేసే ఇనుపతీగ షెడ్డు ఐరన్ పైప్‌లకు కట్టి ఉంది. అదే పైపులకు సీటింగ్ ఫ్యాన్ విద్యుత్ తీగ ఉంది. విద్యుత్ తీగ ఫెయిల్ అయి పైపు నుంచి దండేనికి విద్యుత్ సరఫరా కావడంతో ఈ ప్రమాదం జరిగింది. శారద భర్త శ్రీనివాస్ ఐదేళ్ల క్రితం గుండెపోటుతో చనిపోయాడు. వీరికి వంశీ, శిరీష పిల్లలు ఉన్నారు. ఐదేళ్ల క్రితం ఇంటి పెద్దదిక్కు కోల్పోవడం, ఇప్పుడు శారద మృతితో ఆ కాలనీలో విషాదం నెలకొంది. వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

వీడిన హత్యకేసు మిస్టరీ

- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీ షర్మిల



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: గత నెలలో బాసరలో జరిగిన హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఘటనకు పాల్పడిన ముగ్గురు మైనర్లను అరెస్ట్ చేశారు. ఎస్పీ జానకీ షర్మిల ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బాసర, సగ్రోలి (బిలోలి)కి చెందిన ముగ్గురు మైనర్లు జూన్ 1న తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై బాసరకు వెళ్తుండగా ధర్మాబాద్‌లోని ఓ హోటల్ వద్ద ఉన్న నిజామాబాద్ జిల్లా ఫకీరాబాద్‌కు చెందిన అర్జున్ వారిని లిఫ్ట్ అడిగాడు. వారు నిరాకరించడంతో తాగిన మైకంలో ఉన్న అర్జున్ వారిని బూతులు తిట్టాడు. దీంతో ఎలాగైనా అతన్ని చంపాలని నిర్ణయించుకున్న నిందితులు అర్జున్‌ను బైక్‌పై కూర్చోబెట్టుకుని బాసరకు బయల్దేరి వెళ్లారు. అక్కడ టవర్ పక్కకు తీసుకెళ్లి కట్టెతో తలపై కొట్టడంతో కింద పడిపోయాడు. మరొకరు తలపై బండరాయితో మోది ముళ్లకంపపై పడేసి నిప్పు పెట్టి అక్కడి నుంచి పారిపోయారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా ఈనెల 7న బాసర రైల్వే స్టేషన్ వద్ద అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ అవినాష్ పాల్గొన్నారు.

రెండు మద్యం షాపుల్లో చోరీ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రెండు మద్యం షాపుల్లో శనివారం రాత్రి దొంగతనాలు చోటు చేసుకున్నాయి. దుండగులు షట్టర్లు పగలగొట్టి లోనికి చొరబడ్డారు. విద్యానగర్ సమీపంలోని బాలాజీ వైన్స్, శివాజీ చౌక్‌లోని తిరుమల వైన్స్‌లో చోరీకి పాల్పడ్డారు. విషయాన్ని రాత్రి గస్తీ చేస్తున్న పోలీసులు గమనించి దుకాణాల నిర్వాహకులు సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకున్నారు. బాలాజీ వైన్స్‌లో దాదాపు రూ.40వేల నగదు ఎత్తుకెళ్లినట్లు యజమాని చెబుతుండగా, తిరుమల వైన్స్‌లో మందు బాటిళ్లను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్, టూటౌన్‌లలో కేసులు నమోదయ్యాయి. పోలీసులు ఫింగర్‌ప్రింట్స్ టీమ్‌తో వివరాలు సేకరిస్తున్నారు.

బావిలో పడి బాలుడి మృతి


పంద్ర బండు(ఫైల్)

ఇంద్రవెల్లి: బావిలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని దోడంద గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. కుటుంబీకులు, ఎస్సై తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 5న గ్రామానికి చెందిన పంద్ర జంగు కుమారుడు బండు(15) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెదికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం చేను పనులకు వెళ్లిన కూలీలకు గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని బాలుడి మృతదేహంగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

సమాజహితం.. రచనలతో చైతన్యం

- నగటు జీవితాంశాలే కథా వస్తువులు..
- సాహిత్యంతో రాణిస్తున్న జిల్లాకవులు, రచయితలు


భీమేశ్ తొలి ప్రచురణ సంపుటిని ఆవిష్కరిస్తున్న తమిళసై సౌందరరాజన్(ఫైల్)

నిర్మల్ జిల్లాకు చెందిన పలువురు రచయితలు, కవులు, సాహితీవేత్తలు సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో విభిన్నపాత్ర పోషిస్తున్నారు. తెలుగు భాష, తెలంగాణ సంస్కృతి, గ్రామీణ ప్రాంత వాతావరణం, జానపదం, వ్యవసాయం, కార్మికులు, రైతులు వంటి కథాంశాలను తీసుకుని రచనలు చేస్తున్నారు. తమ రచనలను నేటి యువతరాన్ని కూడా ఆకట్టుకునేలా సృజనాత్మక శైలిలో రచించి పాఠకులకు అందుబాటులో ఉంచుతున్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, లాప్టాప్ వంటి ఎన్నో పరికరాలు ఉన్నప్పటికీ సాహితీగ్రంథాలు సైతం కూడా తమ ప్రాధాన్యతను చాటుతున్నాయి. అలాంటి వారిలో నిర్మల్ జిల్లాకు చెందిన సాహితీవేత్తలు ముందువరుసలో ఉన్నారు. – నిర్మల్‌ఖిల్లా

సహజ పరిస్థితులే మూలాధారాలు...






నిర్మల్ జిల్లా కేంద్రంలో నివాసముంటున్న డాక్టర్ టి.సంపత్ కుమార్ ఉద్యోగ రీత్యా 40 ఏళ్లు ఢిల్లీలోని కెనడా హైకమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహించారు. ఉద్యోగవిరమణ పొందిన ఆయన ప్రస్తుతం ప్రవృత్తిగా అభిరుచి మేరకు రచనలు చేస్తూ సాహితీతృష్ణను చాటుతున్నారు. తనకు చిన్ననాటి నుంచి రచనలు చేయడం అలవాటు. ఈ క్రమంలోనే 1987 నుంచి రచనలు చేస్తూ వస్తున్నారు. ఇప్పటివరకు తెలుగులో 50 పైగా కథలు, నవలలు, వ్యాసాలు ప్రచురించారు. ఆయన రాసిన '62 నాట్ అవుట్', 'నా నుంచి మన వరకు..' అనే కథనాలు సంపుటులు, 'కదలికలు' అనే నవల బహుళ ప్రాచుర్యం పొందాయి. 62 కథలతో ఇంగ్లిష్‌లో తాను రాసిన '62 నాట్ అవుట్' అనే కథల పుస్తకంలో సాధారణ స్థితిగతులలో ఉండే కథాంశాలను తీసుకుని రచనలు చేశారు. తెలుగు, ఇంగ్లిష్‌లో కలిపి దాదాపు 300 పైగా వ్యాసాలు కవితలు కూడా రాశారు. తను మొదట రాసిన కథ 'బాగా సదువుకో'.. తొలిసారి ఒక ప్రముఖ వార పత్రికలో ప్రచురితమైంది. లియోసా కథల సంకలనం బహుళప్రాచుర్యం పొందింది. చంద్రి 78,000 సాహితీ అకాడమీ హిందీ సంకలనంలో చోటు దక్కించుకున్నది. 'నా నుంచి మన వరకు'.. కథల సంపుటి గ్రంథానికి ఉత్తమ కథల పుస్తకంగా గతేడాది తెలంగాణ సారస్వత పరిషత్ పురస్కారం దక్కింది. ఇందులో సాధారణ దిగువ మధ్యతరగతి కుటుంబ నేపథ్యంతో కూడిన అనేక కథలు ఉన్నాయి. స్థానిక గ్రామీణ ప్రాంత యాస, భాష సంస్కృతిని ప్రతిబింబించే విధంగా కథలు రాయడం సంపత్ ప్రత్యేకత.

మనసుకు సంకెళ్లు వేసే సాహిత్యం..





మాటల్లో చెప్పే దానికంటే జనబాహుళ్యంలోని పదాలతో సాహిత్య రూపంలో చెప్పే దానిలోని అర్థం నిగూఢంగా దాగి పాఠకుల మనసులను ఇట్టే ఆకట్టుకుంటుంది. జిల్లాకు చెందిన యువ కవి, సాహితీ అభిలాషి, కళాకారుడైన 'పోలీస్ భీమేశ్' ఇదే రీతిలో ముందుకు సాగుతున్నాడు. నిర్మల్ రూరల్ మండలం అనంతపేట గ్రామానికి చెందిన భీమేశ్ సాహితీరంగంలో రాణిస్తున్నాడు. మూడు పదుల వయసులోనే కవిగా, శిల్పిగా, చిత్రకారుడిగా బహుముఖ ప్రజ్ఞను చాటుతున్నాడు. సమాజంలోని సమకాలీన అంశాలనే కథాంశంగా తీసుకుని రచనలు చేస్తున్నారు. ఇటీవల 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే కవితా సంపుటిని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక చేయూతతో విడుదల చేశారు. కొన్ని నెలల క్రితం ప్రచురితమైన తన కవితా సంకలన గ్రంథాన్ని రాష్ట్ర మాజీ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అయితే ఇటీవల రాష్ట్ర సాహితీ సంస్థ అయిన తెలంగాణ సారస్వత పరిషత్ 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే గ్రంథానికి తొలి పుస్తక రచయిత పోలీస్ భీమేశ్‌కు యువ పురస్కారం ప్రకటించింది.

ఆర్టిస్టులకు గుర్తింపు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్

జన్నారం: ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆర్టిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని, ప్రభుత్వం తరపున ఆదుకోవాలని తెలంగాణ ఆర్టిస్టుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. జన్నారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో సమితి రాష్ట్ర ముఖ్యనాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి రాజేశ్వర్ హాజరై మాట్లాడారు. తెలంగాణలోని ఆర్టిస్టులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన వివిధ శాఖల పెయింటింగ్ పనులకు టెండర్ ప్రక్రియ రద్దు చేసి నామినేటెడ్ విధానంలో నేరుగా ఆర్టిస్టులకు పనులు ఇవ్వాలని కోరారు. 55 ఏళ్లు నిండిన ఆర్టిస్టులకు నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రమాదంలో పాక్షిక, శాస్వత వైకల్యం కలిగిన వారికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణించిన ఆర్టిస్టుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇళ్లులేని పేద ఆర్టిస్టులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాయింగ్ టీచర్లను రెగ్యూలర్ చేయాలన్నారు. సమావేశంలో తెలంగాణ ఆర్టిస్టుల సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, కోశాధికారి మైదం మల్లేశ్, కార్యదర్శి విశ్వతేజ, జిల్లా, మండల నాయకులు విశ్వకుమార్, అమర్, సుజీత్, శ్రీను, విజయ్ తదితరులు పాల్గొన్నారు.